

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



అనకాపల్లి | సంపుటి: 2 | సంచిక: 138 | మంగళవారం | 15-10-2024 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 4 | వెల : 3.00

## ప్రశాంతంగా ముగిసిన మద్యం దుకాణాలు కేటాయింపు

### పారదర్శకంగా లాటరీ ప్రక్రియ

### -జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్













అనకాపల్లి పెన్ సత్తా అక్టోబరు 14: జిల్లాలో మద్యం దుకాణాలు కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. సోమవారం అనకాపల్లిలో గల సత్యలక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్ నందు మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో 136 ప్రభుత్వ మద్యం దుకాణాలకు గాను వచ్చిన 3,291 దరఖాస్తుదారుల సమక్షంలో జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ పర్యవేక్షణలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధాకర్, సిబ్బంది లాటరీ ప్రక్రియ చేపట్టారు. దుకాణాల వారీగా లాటరీ నిర్వహించి, ఎంపికైన ధరఖాస్తుదారులకు దుకాణాలు కేటాయించారు. లాటరీ ప్రక్రియ ఈ రోజు ఉదయం 8 గంటలకు మొదలు పెట్టి మధ్యాహ్నం 12 గంటల 30 నిమషాలు వరకు కొనసాగినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధాకర్ తెలిపారు. అనకాపల్లి జిల్లాలో గల 8 ఎక్సైజ్ స్టేషనుల పరిధిలో గొలుగుండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్కువగాను, సబ్బవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తక్కువగా ధరఖాస్తులు వచ్చాయన్నారు. 16-10-24 తేది నుంచి 136 ప్రభుత్వం మద్యం దుకాణాలు ఈ రోజు లాటరీ లో వచ్చిన విజేతలు ద్వారా నడుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, ఎ.ఇ.ఎస్. టి. రాజశేఖర్, జిల్లాలో గల ఎక్సైజ్ సి.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి కలెక్టర్



అనకాపల్లి పెన్ సత్తా అక్టోబరు 14 : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం పై జిల్లా స్థాయి కమిటి సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం 1994 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లా లో ప్రస్తుతం లింగ నిష్పత్తి 1000 మంది బాలురు, 978 బాలికలుగా ఉందని, లింగ నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. బాలికలను కాపాడు కోవాలని, వారి పై వివక్ష చూపకూడదని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. చట్టం క్రింద గర్భం ధరించడానికి ముందుగాని తర్వాత గాని లింగ ఎంపికను నేరంగా పరిగణించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఏ లేబరేటరీ గాని, స్కానింగ్ కేంద్రం గాని గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశ్యంతో చేయరాదని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయిల జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా కలెక్టరు తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడ శిశు వు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ (pcpndt.ap.gov.in) ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. లింగ నిర్ధారణ పరీక్షలకు ఎవరూ వెళ్లవద్దని ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని ఆమె కోరారు. ఆడపిల్ల విలువ అపారమని, మనమంతా కలిసికట్టుగా లింగ వివక్షతకు చరమగీతం పాడుదామని, ఆడపిల్ల రక్షణ బాధ్యత మనదే అని అన్నారు. ఎఎన్ఎమ్, ఆశాలు గృహ సందర్శనాలు, తదితర విధాలుగా ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. నూతన వధూవరులకు, గర్భవతికి, అత్త మామలకు దీనిపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా ఎం ఎస్ వి కె బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 73 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కొత్తగా 11 కేంద్రాలు గుర్తింపు కొరకు ధరఖాస్తులు వచ్చాయన్నారు. స్కానింగు కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. బాలికలు సంరక్షణ పై ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి రమేష్, కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో పంచకర్ల





పెందుర్తి పెన్ సత్తా అక్టోబర్ 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పెందుర్తి నియోజకవర్గం పెందుర్తి మండలంలో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు. సోమవారం ఈ కార్యక్రమంలో భాగంగా పెందుర్తి మండలం ముదపాక గ్రామపంచాయతీ, గుర్రం పాలెం గ్రామ పంచాయతీ, వలిమెరక జుత్తాడ గ్రామపంచాయతీ, ఎస్ఆర్ పురం గ్రామ పంచాయతీలలో పలు అభివృద్ధి పనులకు రమేష్ బాబు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి మండలం ఎంపీపీ, మండల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ కి సంబంధించిన డి ఏ, ఏఈ, గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, గ్రామ సీనియర్ నాయకులు, పెందుర్తి మండలం ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో శంకుస్థాపనలు చేసిన సీఎం రమేష్





కశింకోట పెన్ సత్తా అక్టోబర్ 14: రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో కశింకోట గ్రామం లో 2.24 కోట్ల రూపాయలు సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేసిన అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీ.ఎం రమేష్. సోమవారం కశింకోట గ్రామం లో అగ్రహారం వీధి నందు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ రెండు కోట్ల 24 లక్షల రూపాయలు సీసీ రోడ్లు పనులకు కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులతో కలసి భూమి పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ కసింకోట గ్రామంలో మూడు కోట్ల 88 లక్షల రూపాయల వరకు అభివృద్ధి కార్యక్రమాల కొరకు కేటాయించడం జరిగిందన్నారు. దానిలో భాగంగా అగ్రహారం వీధి నందు రెండు కోట్ల రూపాయల పైచిలుకు సీసీ రోడ్ల పనులకు ముందుగా శ్రీకారం చుట్టడం శుభ సూచకం అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెప్పట్ట బోతున్న 'పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమం అక్టోబర్ 14 వ తేదీ నుంచి 20 వ తేదీవరకు జరుగుతాయి అని, రాష్ట్ర వ్యాప్తంగా 4,500 కోట్ల నిధులతో చేపట్ట బోతున్న 30,000 వేల పనులుకు శ్రీకారం చుట్టడం కూటమి విజయం అని, వచ్చే 5 యేళ్లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రామాణికం అని తెలిపారు. ఆగస్టు 23 న తీసుకున్న నిర్ణయాలకు ఈరోజు శంకుస్థాపన చేసి సంక్రాంతి లోపు పూర్తిచేయడానికి అధికార యంత్రాంగం సహకారనికి, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. అదేవిధంగా గత ప్రభుత్వం లో జగన్ మోహన రెడ్డి దోచుకోవడానికే మొదటి ప్రాధాన్యత ఇచ్చారు అని, దాదాపు అభివృద్ధికి వెచ్చించాల్సిన 3,000 కోట్ల రూపాయలు నిధులను దారి మళ్లించారు అని దుయ్యబట్టారు. కశింకోట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. కశింకోట గ్రామం ఎన్నికల సమయంలో 4,500 పై చిలుకు మెజారిటీ ఇచ్చినందుకు ధన్యవాదములు తెలియజేస్తూ, గ్రామానికి కావాల్సిన అన్నీ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానున్నారు. గ్రామానికి సురక్షిత మంచినీటి ప్లాంట్ల ను ఎన్ని అవసరం ఐతే అన్నీ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తాము అని హామీ ఇచ్చారు. అదే విధంగా గ్రామానికి కళ్యాణ మండపం కావాలి అని వినతి పత్రం అందజేశారని, దానిని కూడా తప్పకుండా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, ప్రభుత్వ నిధులు సమకురకపోయిన పరిశ్రమల సి ఎస్ ఆర్ నిధుల సహకారంతో అయిన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ జగదీష్, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, గ్రామ సర్పంచ్ జయ రంజని, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, డ్వామా పిడి పూర్ణిమ దేవి, మండల ప్రత్యేక అధికారి రోజా రాణి, ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## విశాఖ డెయిరీ యాజమాన్య భూ కబ్జా

### - ఐదు వందల కోట్ల భూమి కొట్టేసిన విశాఖ డైరీ పాలక వర్గం




విశాఖపట్నం పెన్ సత్తా అక్టోబర్ 14: విశాఖ డెయిరీ యాజమాన్య భూ కబ్జా పై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కు, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి కు, రాష్ట్ర సి సి ఎల్ ఏ కమిషనర్ తో పాటు విశాఖ కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, పోలీసు కమిషనర్ కు ఫిర్యాదు చేసిన జీవీఎంసీ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్. విశాఖ రెవిన్యూ డివిజన్ పరిధి చిన్నగదిలి సర్వే నెం-13,21%ఢ%26 లోని 7.95 ఎకరాల లో ఐదు వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి ని విశాఖ డైరీ యాజమాన్యం కబ్జా చేసింది అని సోమవారం విశాఖ కలెక్టర్ కార్యాలయంలో, జీవీఎంసీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో జిల్లా కలెక్టర్ కి, జీవీఎంసీ అదనపు కమీషనర్ కు ఫిర్యాదు చేసిన పీతల మూర్తి యాదవ్. అనంతరం కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి కబ్జా పై నగర పోలీస్ కమీషనర్ కు విజయ విశాఖ డైరీ యాజమాన్యం పై ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ కు, ప్రత్యేక కార్యదర్శి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కు కూడా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యాదవ్ మాట్లాడుతూ విజయ విశాఖ డిస్ట్రిక్ట్ కో-అపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్ కంపెనీ కి అ భూమి పై ఎటువంటి యాజమాన్య హక్కులు లేకపోయనప్పటికి ప్రభుత్వ భూమిని ఆక్రమణ చేసి అక్కడ వివిధ భవన నిర్మాణాలు చేసారన్నారు. కో-అపరేటివ్ సొసైటీ చట్టం 1964 ప్రకారం విజయ విశాఖ డిస్ట్రిక్ట్ కో-అపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్ కంపెనీ సొసైటీ పరిధిలోనికి రాదన్నారు. ఇది ఒక కంపెనీ క్రిందకు వస్తుంది కాబట్టి కంపెనీలకు ఎక్కడ కో-అపరేటివ్ సొసైటీ చట్టం 1964 ప్రకారం భూములు కేటాయించడం జరగదన్నారు. శ్రీ విజయ విశాఖ డిస్ట్రిక్ట్ కో అపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్ కంపెనీ ఆక్రమణలో ఉన్న ఈ భూమి పైన ఇప్పటికె రెండు, మూడుసార్లు గత ప్రభుత్వాలు ప్రత్యేక కమిటీలు వేసి విచారణ చేసారన్నారు. దీని పై విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని, కబ్జా లో వున్న భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలి అని కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులను కోరినట్లు పీతల మూర్తి యాదవ్ తెలియజేసారు.

# అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు కలెక్టర్







అనకాపల్లి పెన్ సత్తా అక్టోబరు 14: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణణ్ తెలిపారు. అర్జీల వివరాలను జిల్లా కలెక్టరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినతులను క్రింది స్థాయి అధికారులకు అప్పగించకుండా స్వయంగా పరిశీలించాలని, సమస్యల పై స్వయంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, ఎస్డిసి రమామణి, సుబ్బలక్ష్మీ, హౌసింగు పిడి శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ రోజు ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాల పై 151 అర్జీలు అందజేసారు. రెవిన్యూశాఖకు సంబంధించి 99, పంచాయతీ రాజ్ శాఖకు 11, ఇతర శాఖలకు 41 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా మొదలైన పల్లె పండుగ











ఎలమంచిలి పెన్ సత్తా అక్టోబర్ 14: ఏటికొప్పాక పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎలమంచిలి నియోజవర్గం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. సోమవారం విజయ్ కుమార్ ఎన్డీఏ కుటుంబ నాయకులు, సర్పంచులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ ఏటికొప్పాక పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమంలో 17 లక్షల రూపాయలతో వాల్ సిసి రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే.సుందరపు విజయ్ కుమార్. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు అని నమ్మిన ఆదినాయకుల నేతృత్వంలో పల్లె పండుగ పేరుతో 14 వ తారీకు నుండి 20 వ తారీకు వరకు పల్లె వారోత్సవాలు ఘనంగా జరపాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఈ వారం రోజులు ప్రతి పల్లెలో సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం మ్యాచింగ్ గ్రాండ్స్ తో 4,500 కోట్ల తో ప్రతి నియోజకవర్గానికి 25 కోట్ల రూపాయలు పల్లె పండుగ కార్యక్రమానికి ఇస్తున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రు లకు విజయ్ కుమార్ ఈ సందర్భంగా ధన్యవాదములు తెలిపారు. ఎలమంచిలి నియోజకవర్గంలో మండలంలో 54 గ్రామాలలో 80 పనులకు గాను నాలుగు కోట్ల 46 లక్షల రూపాయలతో ఈ ఏడు రోజుల్లో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఏటికొప్పాక గ్రామంలో మొదటిగా ప్రారంభించి ఎనిమిది గ్రామాలలో శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన శతకం పట్టు కనకదుర్గ నవరాత్రి మహోత్సవాలు



అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 14: ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం శతకం పట్టు లో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ ఆధ్వర్యంలో ముగిసిన దేవీ నవరాత్రి ఉత్సవాలు, అమ్మవారు ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి అనుపు మహోత్సవంలో భవాని భక్తులు పాల్గొన్నారు, శారదా నదిలో అమ్మవారిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమర శెట్టి వరాహ నూకరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు,శ్రీ గౌరీ పరమేశ్వరి కమిటీ, శ్రీ గౌరీ పరమేశ్వరి ప్రజా టెంట్ హౌస్, శ్రీ మరిడమాంబ ఉత్సవ కమిటీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 16 నుండి కొత్త మద్యం దుకాణాలు

## - చోడవరం సీఐ పాపునాయుడు



చోడవరం పెన్ సత్తా అక్టోబర్14: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ చోడవరం సర్కిల్ పరిధిలో ఉన్న 22 కొత్త మద్యం దుకాణాలు ఈనెల 16 బుధవారం నుండి ప్రారంభమవుతాయని చోడవరం ఎక్సైజ్ సీఐ కెవి పాపునాయుడు తెలిపారు. కొత్త మద్యం పాలసీ విధానంలో లాటరీ ప్రక్రియ పూర్తి అయిందని, మంగళవారం సాయంత్రం వరకు పాత పద్ధతిలో అమ్మకాలు జరుగుతాయని ఆ తర్వాత బుధవారం నుండి కొత్త స్టాక్ తో కొత్త మద్యం పాలసీ ప్రకారం లాటరీలో మద్యం దుకాణం సంపాదించుకున్న వారు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలాల వారీగా చోడవరంలో 8 షాపులు, బుచ్చియ్యపేటలో 5 దుకాణాలు, కే.కోటపాడులో 5 షాపులు, దేవరాపల్లిలో 4 మద్యం దుకాణాలు ఉంటాయని, గతం కంటే మద్యం కూడా తక్కువ ధరలో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన పల్లా





అగనంపూడి పెన్ సత్తా సెప్టెంబర్ 14: జీవీఎంసీ 85 వ వార్డు అగనంపూడి పునరావాస కాలని కొండయ్యవలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీ లో మహాత్మ జ్యోతిరావు పూలే అంబేద్కర్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతరత్న అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు చేతుల మీదగా ఆవిష్కరించారు. సోమవారం ఈ కార్యక్రమంలో కాలనీ సమస్యల పై సంఘం సభ్యులు ఎమ్మెల్యేకి వింత పత్రం ఇవ్వడం జరిగింది. సంఘ నాయకులు కే పరంధామయ్య సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, బొండా జగన్, ఉక్కు అఖిలపక్ష నాయకులు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్ రామారావు, విల్లా రామ్మోహన్ కుమార్, రాష్ట్ర దళిత నాయకుల పాల్తేటి పెంటారావు, బూసి వెంకట రావు, బత్తుల శ్రీనివాస రావు, స్థానిక కుటమి నాయకులు, అంబేద్కర్ కాలనీ సంఘ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం





అనకాపల్లి పెన్ సత్తా అక్టోబరు 14: జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంతో పండుగ వాతావరం ఏర్పడిందని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణణ్ తెలిపారు. సోమవారం ప్రారంభమైన పల్లెపండుగ కార్యక్రమం ప్రతి మండలంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమం క్రింద జిల్లాలో 214 కోట్లు రూపాయలతో 2,343 పనులు చేపట్టనున్నామని, గ్రామాలలో మౌళిక సదుపాయాల కల్పనకు గాను 172.3 కోట్ల రూపాయలతో 1,697 పనులు, వ్యక్తిగతంగా లబ్దిచేకూర్చే 41.7 కోట్ల రూపాయలు విలువచేసే 646 పనులను చేపట్టి పూర్తిచేయనున్నట్లు ఆమె తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు చేసినట్లు ఆమె తెలిపారు. జిల్లాలో సోమవారం గ్రామాలలో పల్లెపండుగ నిర్వహించినట్లు నోడల్ అధికారి, డ్వామా ప్రోజెక్టు అధికారి బి.పూర్ణిమదేవి తెలిపారు.





# కలెక్టరేట్ వద్ద సచివాలయ హెల్త్ సెక్రటరీల ఆందోళన





పెన్ సత్తా బ్యూరో చీఫ్ : గ్రామ, వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీలను పూర్తి స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ లోకి తీసుకురావాలని, ఎం.పిహెచ్ఎ(ఎఫ్)లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. సోమవారం ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం వీరు డిఎం& హెచ్ ఓ, జిల్లా కలెక్టర్ కి వినతిపత్ర సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆళ్ళ దేవకి మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలు మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓ, డిఎం & హెచ్ఓ పరిధిలలో పనిచేయడంవలన, వీరంతా ఒకే సమయంలో వేరు వేరు పనులు మాకు అప్పగించడం వలన మేము గత మూడు సం।।లుగా తీవ్ర మానసిక ఒత్తిడిని, పనిభారాన్ని భరిస్తూ విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. దీనిని సరి చెయ్యమని, వివిధ శాఖల మధ్య సమన్వయం జరిగేలా తగు ఆదేశాలు జారీ చెయ్యమని, మొత్తం సిబ్బందిని వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో తీసుకు రావాలని ఎంత మొత్తుకున్నా ప్రభుత్వం మా మొర ఆలకించడం లేదని అన్నారు. గత 3 సం లుగా దీని పై కోరుతున్న సమస్య పరిష్కారం కాలేదని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసినా దీనిని నేటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి పరిస్తుల్లో ఈ ఆందోళన దిగాల్సి వచ్చిందని, ఈ ప్పటికైనా ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోని మమ్మల్ని పూర్తిస్థాయి గా వైద్యారోగ్య శాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వీరు 1.గ్రామ వార్డు హెల్త్ సెక్రటరీలను పూర్తిస్థాయిలో డి డి ఓ అధికారాలతో సహా వైద్య ఆరోగ్యశాఖకు బదలాయించాలి. 2.సీనియార్టీ లిస్టులు తయారు చేసి, ఎంపీహెచ్ఏ (ఎఫ్) లుగా పదోన్నతులు కల్పించాలి అని, వాటికోసం ఎటువంటి పైరవీలకు అవకాశం ఇవ్వకూడదు. 3.వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే క్షేత్ర స్థాయి సిబ్బందికి ఎఫ్ ఆర్ ఎస్ నుండి మినహాయింపు నివ్వాలి. 4.జీవో ఎంఎస్ నెంబర్ 152 తేదీ 04.05.2010 ప్రకారం మెటర్నిటీ లీవును డెలివరీ తేదీ నుండి కాకుండా, వారు అప్లై చేసిన తేదీ నుండే శాంక్షన్ చేయాలి. 5. ఆరోగ్య కార్యకర్తలు ఉద్యోగంలో చేరినప్పటి నుండి ట్రెజరీ వారి అభ్యంతరాలతో సరెండర్ లీవ్ పొందలేకపోయారు అని, లీవు ఎన్ క్యాష్ మెంటుకై ట్రెజరీ వారికి తగు ఆదేశాలు జారీ చేయాలి. 6. జీవో ఎంఎస్ నెంబర్ 101 తేదీ 11.05.2022 ప్రకారం యూనిఫామ్ ఎలవన్స్ సౌకర్యాన్ని ఆరోగ్య కార్యదర్శిలకు కూడా భేషరతుగా అమలు చేయాలి 7. ఇంటెన్సిఫైడ్ జి.ఎన్ ఎం ట్రైనింగ్ అయిన హెల్త్ సెక్రటరీ లకు ది 04.09.2024 న విడుదల చేసిన జివో ఎం యస్ నం.115 ను వెంటనే అమలు చేయాలి అని వీరు అందోళన ద్వారా డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆందోళన కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, కోశాధికారి వివి శ్రీనివాసరావులు సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రత్నం, లక్ష్మి, సూరి కళ తదితరులు పాల్గొన్నారు.



# దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా భారీ అన్న సమారాధన





అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 14: నిదానందొడ్డి లో వేంచేసియున్న కామాక్షి దేవి ఆలయంలో ఘనంగా ముగిసిన దసరా నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా సోమవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణాధికారి దాడి రత్నాకర్ పాల్గొని అన్న సమారాధాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనకాపల్లి టౌన్ సిఐ టి విజయకుమార్ కామాక్షి అమ్మవారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరిని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అమ్మవారి అనుపు మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు శొంత్యాణ సతీష్, కోశాధికారి ధవలేశ్వరం లక్ష్మణ రావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోటిపల్లి జేజి బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ నరసింహాచారి, ఉత్సవ కన్వీనర్ అములోజు శ్రీను, గోల్తీ అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు శాంత్యాణ సంతోష్ కుమార్, గోడిసతీష్ కుమార్, ఆకోజు వాసు, ద్వారపూడి కృష్ణ, ద్వారపూడి వెంకట సంతోష్ కుమార్, భరణికాన నూకేశ్వరరావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పనసా రెడ్డి జన్మదిన వేడుకలు



చోడవరం పెన్ సత్తా అక్టోబర్14: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు సమక్షంలో టిడిపి నాయకుడు తాడి పనసా రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు పనసా రెడ్డిని సత్కరించి ఆయన చేత కేకు కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొడ్డేడ గంగాధర్, టౌన్ పార్టీ అధ్యక్షులు దేవరపల్లి వెంకట అప్పారావు, టిడిపి నాయకులు సకురు కోటేశ్వరరావు, గుమ్మాల సత్తిబాబు, నేమాల హరి, పప్పు శ్రీను, జెట్టి మాణిక్యం, వింజమూరి శంకర్, ప్రవీణ్, టి.శ్రీను, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, కార్తీక్ వర్మ, బాలబోయిన దేముళ్ళు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల నిర్వహణపై శిక్షణ.... ఎంపీడీవో


చోడవరం పెన్ సత్తా అక్టోబర్14: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల నిర్వహణపై నాలుగు రోజులు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని చోడవరం ఎంపీడీవో పి.వీ.ఎన్.జె ఆంజనేయులు తెలిపారు. మండలంలో ఉన్న 32 గ్రామపంచాయతీల్లోని ఉప సర్పంచులు, పంచాయతీకి ఇద్దరు వార్డ్ మెంబర్లు చొప్పున రెండు బ్యాచ్ లు విభజించి ఒక్కొక్క బ్యాచ్ కి రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో పంచాయతీలో సాధారణ కనీస పరిపాలన విధానం, ఏపీపిఆర్ 1994 చట్టం నిబంధనలు, పారిశుద్ధ్యం మరియు వ్యర్థాల నిర్వహణ, త్రాగునీటి సరఫరా, లేఅవుట్ అండ్ బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, గ్రామ పంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు మరియు విద్యుత్ బిల్లలు నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, కోర్టు కేసులుపై అవగాహన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక సంక్షేమ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని ఎంపీడీవో తెలిపారు.

# స్కేటింగ్ లో ప్రతిభ కనబరిస్తున్న విద్యార్థిని



చోడవరం పెన్ సత్తా అక్టోబర్14: మండలంలోని నరసయ్యపేట గ్రామానికి చెందిన పెంటకోట యుక్తిక అనే విద్యార్థిని స్కేటింగ్లో ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు సాధించింది. ఇటీవల శివాజీ పార్క్ లో నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో 7 నుండి 9 ఏళ్ళ విభాగంలో క్లాసిక్ పోటీల్లో బంగారు పతకం, స్పీడ్ పోటీల్లో మరో బంగారు పతకం సాధించింది. గతంలో కూడా ఈ విద్యార్థిని ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించడంతో పలువురు ఆ బాలికను అభినందించారు.

# పశు బీమాతో పాడిరైతులకు ధీమా



నర్సీపట్నం: వ్యవసాయం తర్వాత రైతులు ఎక్కువగా ఆధారపడి జీవించేది పాడి పరిశ్రమ మీదే. వ్యవసాయానికి పాడిపరిశ్రమ అనుబంధమైనప్పటికీ, భూములు లేనివారు సైతం ఒక పాడి పశువుల పెంపకం ద్వారా జీవనోపాధి పొందే పరిస్థితులున్నాయి. అయితే పాడి పశువులను కొనాలంటే ఒక్కొక్కటీ రూ.50 వేలు నుంచి రూ.80 వేల వరకు ఖర్చు అవుతుంది. అంతటి విలువైన పాడిపశువులు అనారోగ్యం, ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో పాడిపశువులుగానీ, జీవాలు గానీ మరణిస్తే రైతు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో పాడిరైతులకు భరోసాగా ఉంటూ, వారికి ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేందుకు పశువుల బీమా పథకం అందుబాటులో ఉంది. పాడి పశువులు, జీవాలకు బీమా చేయిస్తే, ఏదైనా కారణంతో అవి మరణిస్తే, పాడిరైతులు. పెంపకదారులు ధీమాగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం పశువుల బీమాను అమలు చేస్తోంది. ఈ మేరకు దీనిపై ప్రజల్లో అవగాహనకు, వారిని భాగస్వాములను చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ కు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. పశువుల బీమా చేసేందుకు లబ్దిదారుల వాటాగా తెల్ల రేషన్ కార్డున్న వారు బీమా ప్రీమియంలో 20శాతాన్ని చెల్లిస్తే, మిగతా 80శాతాన్ని ప్రభుత్వం భరిస్తుంది. అదే తెల్లరేషన్ కార్డు లేనివారు, ఎబోవ్ పావర్టీ లైన్ ఉన్నవారు 50శాతం ప్రీమియం చెల్లించాలని సూచించారు. పశువులకు మూడేళ్ళ పాటు, జీవాలకు 1, 2 లేదా 3 ఏళ్లకు బీమా పథకం వర్తిస్తుందని ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొంది. రెండేళ్ల నుంచి పదేళ్ల వయస్సు కలిగి ఒక్కసారైన ఈనిన ఆవులకు, మూడేళ్ల నుంచి 12ఏళ్లలోపు వయస్సు కలిగి ఒక్కసారైన ఈనిన గేదెలకు బీమా పథకం వర్తిస్తుంది. ఒక కుటుంబానికి గరిష్టముగా ఐదు పశువులకు బీమా వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేశవాళి, సంకర జాతి ఆడ మరియు మగ పశువులకు రూ.30వేలు వరకు, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేలు వరకు, ఆవులు/గేదెలులో గరిష్టంగా రూ.1.20 లక్షల వరకు, గొర్రెలు, మేకలుకు గరిష్టంగా రూ.15 వేలు వరకు బీమా చేయించుకునే సదుపాయం ఈ పశు భీమా పథకంలో ప్రభుత్వం కల్పించింది.

# రాంకీ యాజమాన్యం విడుదల చేస్తున్న కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

## - సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి ఫిర్యాదు



పరవాడ పెన్ సత్తా అక్టోబర్ 14: మండల కేంద్రమైన పరవాడ ఊర చెరువు, పెద్ద చెరువు, సన్యాసి చెరువు, మొల్లోడు గడ్డ ల్లో రాంకీ యాజమాన్యం అక్రమంగా ఫార్మా పరిశ్రమల నుండి విడుదల చేస్తున్న వ్యర్థ రసాయనిక జలాలతో కలుషితం అవుతున్నాయని డిఆర్ఓ దయానిధికి ఫిర్యాదు చేస్తూ లేఖలో కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రాంకీ యాజమాన్యం అక్రమంగా ఫార్మా పరిశ్రమల నుండి శుద్ధి చేయకుండా వ్యర్థ రసాయనిక జలాలను చెరువుల్లోకి విడుదల చేయడం వలన చెరువులు, భూగర్భ జలాలు నాశనం అవుతున్నాయని వెంటనే చర్యలు తీసుకోవాలని అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ దయానిధికి ఫిర్యాదు చేస్తూ లేఖలో గనిశెట్టి కోరారు. ఈ కాలుష్యం తో పెద్ద చెరువులో చేపలు చనిపోతున్నాయని, పశువులు, జీవరాసులు చెరువులు, కాలువల్లో నీళ్లు తాగడానికి పనికి రావడం లేదని తెలియజేసారు. భరిణికం, పరవాడ, తానం, లంకెలపాలెం, తాడి, సాలాపు వాణి పాలెం, గొర్లివానిపాలెం, బొద్దపు వాని పాలెం, గ్రామాలు ఫార్మా పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో ప్రజలు రాత్రుళ్ళు నిద్రలు పట్టక, స్వాస సమస్యలతో అల్లాడుతున్నారని, కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మా సంస్థల నుంచి సమీపంలో చెరువులు, కాలవల్లోకి వ్యర్థ రసానికి జలాలు విడుదల కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. అంతే కాకుండా ముత్యాలంపాలెం సముద్రం లో కూడా వ్యర్థ జలాల శుద్ధి చేయకుండా విడుదల చేయడం వలన చేపలు ముత్యువాత పడుతున్నాయని, ఇటీవల కాలంలో ఉప్పుటేరులో చేపలు చనిపోయాయని ఈ ఫిర్యాదు లో గనిశెట్టి పేర్కొన్నారు.

# జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 26 ఫిర్యాదులు





అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 14: జిల్లా పోలీసు కార్యలయం లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు వచ్చిన 26 ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు లన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ ఎం.దేవ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలి



సీతమ్మధార: పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే దీక్షలు 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ఎఐటియుసి నాయకులు మసేన్, హెచ్ఎంఎస్ నాయకులు మంగ నాయుడు, సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, ఐఎన్టియుసి నాయకులు చందు, సిఎఫ్టియు నాయకులు మూర్తి, బిఎంఎస్ నాయకులు రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికుల కష్టంతో పోర్టుకు రూ.వేలకోట్ల లాభాలు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం రూ.786 కోట్లు లాభం వచ్చిందని, ప్రభుత్వానికి రూ.171.42 కోట్లు పన్నులు కట్టారని తెలిపారు. పోర్టు ఏర్పడిన 50 ఏళ్లు తర్వాత అప్పటికి వచ్చిన లాభాలతో గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ఏర్పడిందన్నారు. ప్రస్తుతం హాస్పిటల్ను నడపడానికి 100 సంవత్సరాలకు సరిపోయే రిజర్వ్ ఫండ్స్ పోర్టు దగ్గర ఉన్నాయని, అయినా ప్రయివేటు వారికి ఇవ్వాలన్న బిజెపి విధానం చాలా దుర్మార్గమైందని అన్నారు. ప్రజా పోరాటంగా మలిచి హాస్పిటల్ను రక్షించుకుంటామన్నారు. రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన దీక్షలో నాయకులు శంకరరావు, నాయుడు, రాఘవులు, రమణ, ట్రస్టు మెంబర్లు పోతన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చెస్ట్ పెయిన్ క్లినిక్ ప్రారంభం



ఆరిలోవ: ఆరిలోవ హెల్త్ సిటీలోని అపోలో ఆసుపత్రిలో చెస్ట్ పెయిన్ క్లినిక్ను రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ఈ మధ్య కాలంలో యువత గుండెపోటు బారిన పడుతున్నారన్నారు. గుండె సంబంధిత సమస్యలు వస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్డియాక్ మరణాలను నివారించడానికి ఇటువంటి క్లినిక్లు చాలా అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అపోలో సేవలు విస్తరించాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంచే విధంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీస్ డిపార్ట్మెంట్లో పనిచేసే సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చెయ్యాలని మంత్రి కోరగా, అపోలో యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. అపోలో హాస్పిటల్స్ రీజనల్ సిఇఒ వై.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఛాతీ నొప్పి క్లినిక్ సేవలు రామన్నగర్, హెల్త్ సిటీలోని అపోలో ఆసుపత్రిలో అందుబాటులో ఉందన్నారు. గుండె సంబంధిత నొప్పిని త్వరగా గుర్తించి కార్డియాక్ మరణాలను నివారించడానికి ఈ క్లినిక్లను ప్రారంభించామన్నారు. అత్యవసర రోగుల కోసం పది కిలోమీటర్ల పరిధిలో పికప్ సర్వీసులు ఉచితంగా అందించనున్నామని తెలిపారు. అపోలో చెస్ట్ పెయిన్ క్లినిక్లో నిర్ణీత వ్యవధిలో గుండె పోటు రోగులకు చికిత్స చేసేందుకు 24 గంటలూ నిపుణులు అందుబాటులో ఉంటారని చెప్పారు.

# రాష్ట్రంలో ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు

### - త్వరలో క్యాబినెట్ ముందుకు - అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ : చంద్రబాబు



అమరావతి: రాష్ట్రంలో ప్రైవేటురంగంలో ఇండిస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన విధానాన్ని త్వరలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించనుంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలను క్యాబినెట్ సమావేశం ముందుకు తీసుకురావాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఇండిస్ట్రియల్ డెవలప్‌మెంట్, ఎంఎస్ఎంఇ, ఫుడ్ ప్రాసెసింగ్ డ్రాఫ్ట్ పాలసీ తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దాదాపు ఏడు ఎనిమిది శాఖల్లో మార్పులు, చేర్పులతో నూతన విధానాలను తీసుకురానున్నట్లు తెలిపారు. పరిశ్రమలను ఏర్పాలు చేయడానికి అంగీకారం తెలపడంతోపాటు, వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించే తేదీని ఇచ్చే మొదటి 200 కంపెనీలకు అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చే విధంగా ముసాయిదా విధానాల్లో ప్రతిపాదించినట్లు చెప్పారు. వీటికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం మాట్లాడిన సిఎం చంద్రబాబు ఇండిస్టియల్ డెవలప్‌మెంట్, ఎంఎస్ఎంఇ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మహిళా వ్యాపారవేత్తలకు అదనంగా ఐదుశాతం ఇన్సెంటివ్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రైవేటు పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, దీనికి అనుగుణంగా నివేదిక ఉండాలని తెలిపారు. వాటికి సంబంధించి ఇన్సెంటివ్ విధానం, పరిశ్రమల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలపై త్వరలో నివేదిక రూపొందించాలని ఆదేశించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మార్గం సుగమం చేసేలా నూతన పాలసీ ఉండాలని సిఎం తెలిపారు. ఎంఎస్ఎంఇ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రైవేటు ఇండిస్టియల్ డ్రాఫ్ట్ పాలసీపై మరింత కసరత్తు జరగాలని తెలిపారు. నూతన పాలసీలతో రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చేందుకు ఆస్కారం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఎస్క్రో ఎకౌంట్ ద్వారా ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని, ఇది పారిశ్రామిక ప్రగతికి, ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తుందని వివరించారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త అనే కాన్సెప్ట్‌తో ఎంఎస్ఎంఇ పాలసీ ఉండాలన్నారు. పారిశ్రామికవేత్త రతన్ టాటా పేరుతో అమరావతిలో రతన్ పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడేలా టాటా ఇన్నోవేటివ్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సిఎం ప్రకటించారు. ఇది స్కిల్స్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, ఫెసిలిటేషన్ కేంద్రంగా ఉంటుందని తెలిపారు. దీనికి అనుబంధంగా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో సెంటర్‌కు ఒక్కో మల్టీనేషన్ కంపెనీ మెంటార్‌గా ఉండేలా ప్లాను చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగ కల్పన తమ ప్రభుత్వ విధానమని, దానికి అనుగుణంగా నూతన విధానాలు ఉండాలని సిఎం అన్నారు. సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాదు మాట్లాడుతూ ఆక్వా, పౌల్ట్రీ రంగాల్లో వచ్చిన విధంగానే ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఫలితాలు వచ్చేలా విధానాలు అమలు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు టిజి భరత్, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యాభ్యాసానికి పాడేరు అనుకూలం - వైద్యవిద్యార్ధులతో కలెక్టర్ దినేష్‌కుమార్



పాడేరు: నైపుణ్యమైన వైద్యవిద్యను అభ్యసించేందుకు పాడేరు అనువైన, సురక్షిత ప్రాంతమని, విద్యార్ధులు భయాందోళనలు లేకుండా వైద్యవిద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మెడికల్ విద్యార్ధులకు సూచించారు. పాడేరు మెడికల్ కాలేజీలో మెడికల్ కళాశాలను, ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం తరగతులను జిల్లా కలెక్టర్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్ధులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ ఏడాది నుంచే మెడికల్ కాలేజీలను ప్రారంభించాలని కృతనిశ్చయంతో చర్యలు చేపట్టిందన్నారు. నెల రోజులుగా ఇంజినీరింగ్ అధికారులు అత్యంత కృషి చేసి మెడికల్ కళాశాలతో పాటు అనాటమీ, ఫిజియాలజి, బయో-కెమిస్ట్రీ ల్యాబులు, తదితరాలు భవనాలను పూర్తి చేసి అందివ్వడం గొప్ప విషయమని కొనియాడారు ఈ ఏడాది నుండే పాడేరు వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించాలని, 50 మందికి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పించారు. కాగా తొలిరోజున 42 మంది విద్యార్ధులు, వారి తల్లిదండ్రులు కాలేజీ ఆహ్వానం మేరకు హాజరయ్యారన్నారు. పాడేరులో వైద్యవిద్య అంటే కొంతమంది తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసిందన్నారు. విద్యార్ధులు, తల్లిదండ్రులు ఎటువంటి అపోహలు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతమైనా, ఇతర ప్రాంతాలతో పాడేరుకు కనెక్టవిటీ ఉందని, అలాగే ఎటువంటి సమస్యలు లేని ప్రశాంతమైన వాతావరణం పాడేరులో ఉందన్నారు. విద్యార్ధులకు అన్ని రకాలుగా రక్షణ కల్పిస్తామని, మరో రెండు మూడు నెలలలో పూర్తిస్థాయి సౌకర్యాలు, ఆటస్థలం కూడా అందుబాటులోకి వస్తుందని భరోసానిచ్చారు. విద్యార్ధులకు థియరీతోపాటు ప్రాక్టికల్‌గా అవగాహనకు ఇక్కడి ఆసుపత్రిలో అవుట్ పేషంట్లు, ఇన్‌పేషెంట్లు అందుబాటులో ఉంటారన్నారు. ఏజెన్సీలోని గిరిజనులకు వచ్చే వ్యాధులపై అధ్యయనం, అవగాహన ద్వారా వారికి వైద్యసేవలు అందించే భాగ్యాన్ని దక్కించుకోవడంతోపాటు, ఇక్క కళాశాలలో అన్ని శాఖల విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లు విద్యార్ధులను స్వంతంగా భావించి వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ 2010లో తాను వైద్య విద్యను అభ్యసించిన నాటి అనుభవాలను వివరించారు.

# పారదర్శకంగా అభివృద్ధి పనులు

### - సంక్రాంతికి మొదటి దశ పనులు పూర్తి శ్రీ పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



కృష్ణాప్రతినిధి : రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడు తోందని, పనులు పారదర్శకంగా నిర్వహించేందు కు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలో రూ. 91 లక్షల విలువైన పనులకు శంకుస్థాపన చేసి 'పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పవన్ మాట్లాడుతూ%®ొ% జాతీయ ఉపాధి హామీ చట్టం%®ొ% ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతోంద న్నారు. ఈ చట్టంలోని మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.4500 కోట్లతో పంచాయతీల్లో రహదారులు, డ్రయిన్లు, 30 వేల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆగస్టు 23న గ్రామ సభల ద్వారానే ఈ పనులకు తీర్మానం చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులపాటు ఈ పనుల శంకుస్థాపన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా పనిచేసి మొదటి దశ పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలన్నారు. కాకినాడలో అటవీశాఖ అధికారి తన పేరు ఉపయోగించుకుని చేస్తున్న పనులు తమ దృష్టికి వచ్చిందన్నారు. మోడీతో మాట్లాడి కోనసీమ- మచిలీపట్నం రేపల్లే రైల్వే లైనును సాధిస్తానని చెప్పారు.

# మధురవాడలో శ్రీ టెక్ ఐటి కంపెనీ ప్రారంభం




మధురవాడ: జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలస వద్ద హరి తోట ఏర్పాటుచేసిన శ్రీటెక్ ఐటి కంపెనీని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటి ఉద్యోగి నిరంతరం తన ప్రతభను పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఐటి టెక్‌లో మంచి మార్పులు వస్తాన్నాయన్నారు. రానున్న రోజుల్లో విశాఖ మంచి ఐటి హాబ్‌గా మారనున్నట్లు తెలిపారు. ఐటి మంత్రి నారా లోకేష్ కృషితో టిసిఎస్ కంపెనీ ద్వారా 10 వేలు ఉద్యోగాలు వస్తున్నాయని తెలిపారు. అనంతరం భీమిలి, పాలకొండ, గాజువాక ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, నిమ్మక జయకృష్ణ, పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఐటి ఉద్యోగులు నిత్య విద్యార్ధులుగా తన ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు. శ్రీ టెక్ సిఇఒ హరి తోట మాట్లాడుతూ, తమ సంస్థ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, భీమిలి జనసేన ఇంచార్జ్ సందీప్ పంచకర్ల పాల్గొన్నారు.

# అభిజిత్ ఫెర్రోటెక్ అక్రమ లాకౌట్ ఎత్తివేయాలి



విశాఖ: అచ్చుతాపురం ఎస్సీ జడ్ లో ఉన్న అభిజిత్ ఫెరోటెక్లో సుమారు వెయ్యి మంది ఉద్యోగులు కార్మికులు రోడ్డున పడ్డారు. పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమ గేటుకు లాకౌట్ చేస్తున్నట్టు నోటీసు అతికించారు. దీనిని నిరసిస్తూ పరిశ్రమ గేటు వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గేట్ వద్ద జరుగుతున్న ధర్నా నుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కే .సోమినాయుడు మాట్లాడుతూ ఎస్సీజడ్లు వస్తే కార్మికుల జీవితాలు మారిపోతాయి అని చెప్పిన అధికారులు నేడు కార్మికులతో సంప్రదించకుండా వాళ్ళిష్టానుసారం ఈరోజు ఉదయం విధులకు వెళుతున్న కార్మికులను గేటు వేసి బయటపెట్టారు. దీనిపై ప్రభుత్వం కలుగజేసుకొని కార్మికులకు పాత పద్ధతిలో పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభిజిత్ కార్మికులు, ఉద్యోగులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# ఉప్పుటేరులో మృతి చెందిన చేపల పరిశీలన



నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట సముద్రతీరం దొండవాక మొగ ఒడ్డుకు చేరిన మృతి చెందిన చేపలను కాలుష్యనియంత్రణ మండలి, మత్స్యశాఖ అధికారులు పరిశీలించారు. ఉప్పుటేరులో చేపలు మృత్యువాత పడి ఆదివారం ఒడ్డుకు చేరాయి. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకారులు ఆదివారం ఉప్పుటేరు వద్దకు వెళ్లి మృతి చెందిన చేపలను పరిశీలించారు. హెటిరో కంపెనీ వ్యర్ధ రసాయన జలాలు ఉప్పుటేరులో వదలడం వల్లనే చేపలు మృతి చెందాయని ఆరోపించారు సమాచారం తెలుసుకున్న కాలుష్య నియంత్రణ మండలి శాఖ ఇఇ ముకుందరావు, మత్స్యశాఖ అధికారులు ప్రసాద్, షేక్ జాస్మిన్ సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. మత్స్యకారులు తమ ఆవేదనను అధికారులు ఎదుట వెలిబుచ్చారు. హెటిరో కంపెనీ వ్యర్థ జలాలు శుద్ధి చేయకుండా సముద్రంలోకి, ఉప్పుటేరులోకి వదలడం వల్లనే సుమారుగా ఐదారు టన్నులు చేపలు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పుటేరులో ఇంత పెద్దఎత్తున చేపలు మృత్యువాత పడితే తామంతా ఎలా జీవనం సాగించాలని ఆవేదన వెలబుచ్చారు. ఉప్పుటేరు మీద ఆధారపడి బ్రతికే కొన్ని వందల కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నారన్నారు. తామంతా సముద్రం నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, చేపలు వేట తప్ప మరో వృత్తి తమకు తెలియదన్నారు. హెటిరో కాలుష్యం కారణంగా తమ బతుకులు ఆగమ్యగోచరంగా మారాయన్నారు. హెటిరో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కంపెనీ వ్యర్థ జలాలు ఉప్పుటేరులో కలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. మృతి చెందిన చేపలు, ఉప్పుటేరు లో నీటిని అధికారులు శాంపిల్స్ తీసుకొని తీసుకువెళ్లారు. కార్యక్రమంలో గోసల స్వామి,భూలోక,నూకరాజు, దేముడు, కాశి, కాశీరావు, సోమేష్, కోదండరావు, ఎం శివాజీ పాల్గొన్నారు.

# అరటి తొక్క కథకు ఉత్తమ బహుమతి



కశింకోట(అనకాపల్లి): భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో సింహప్రసాద్ సాహిత్య సమితి నిర్వహణలో మహాకవి శ్రీశ్రీ స్మారక కథల పోటీ లో కశింకోట చెందిన బొడ్డేడ బలరామస్వామి రాసిన అరటితొక్క కథ ఈ పోటీలలో ఉత్తమ కథగా బహుమతి గెల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ సభలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె. వి. రమణాచారి బొడ్డేడ బలరామస్వామిని శాలువాతో సత్కరించి, నగదు, ప్రశంసాపత్రం, షీల్డ్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో తొలి తెలంగాణ బి సి కమిషన్ ఛైర్మన్, ప్రముఖ రచయిత బి. ఎస్. రాములు, ప్రముఖ రచయితలు విహారి, వాణిశ్రీ, పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు : చంద్రబాబు



అమరావతి: అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతుండటంతో ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులు, కాలువలు, నీటి వనరుల వద్ద అప్రమత్తంగా ఉండటంతో పాటు పర్యవేక్షణ ఉంచాలన్నారు. వాగులు, కాలువలు వద్ద అవసరమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెయిన్‌ఫాల్ వివరాలను కూడా రియల్ టైమ్‌లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. అతి భారీ వర్షాలు ఉండే ప్రాంతంలో ప్రజలకు ముందుగా సమాచారం ఇచ్చి అప్రమత్తం చేయాల సూచించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అవసరమైన ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌టిఆర్ఎఫ్ టీమ్స్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com